# ఒంటరి

జ్యోతిశ్రీ

ఒకటో.... రెండోకాదు! .... ఏకంగా పదిహేను రోజులు! బాప్‌రే... పదిమీద ఐదు రోజులు! సరిగ్గా ఓ పక్షం...

అయినా... శాంతరాలేదు!

పదిహేను రోజుల ముందు రాశానుత్తరం. అయినా రాలేదు!! పోనీ పదనుకుందాం..


అలా లెక్కేసినా ఐదురోజుల ముందే రావాలి!

కానీ రాలేదు!

అర్జంటుగా రమ్మనీ, రాకపోతే కుదరదనీ, నువ్వు లేకుండా యిక్కడేం బావోలేదనీ, ఉత్తరం అందగానే... అమ్మాయి కాదన్నా, అల్లుడుగారు ఇబ్బంది పడినా సరే, సరాసరి వచ్చేయమనీ... ఎదురు చూస్తుంటాననీ ఐదారు రోజుల్లో యిక్కడుండకపోతే, ఏడో రోజున అన్నం మానేస్తాననీ... స్పష్టంగా, నిర్మొహమాటంగా రాశా!

అయినా... అయినా శాంతరాలేదు!

నెలరోజుల్లో వస్తానన్న మనిషి – రెండునెలలు దాటి మూడు రోజులు గడిచినా రాలేదంటే... కనీసం



కబురయినా లేదంటే... ఎవరయినా చేసేదదే! అన్నమాట నిలబెట్టుకోనందుకు ఘాటుగానే రాశాను! అయినా శాంతరాలేదు.

నాలుగు రోజులుగా స్టేషన్‌లో ఎదురు చూస్తున్నాను. నాలుగు రోజుల్లో ఎంత లేదన్నా నలభై రైళ్లొచ్చాయి. ఐదారు వేల మంది వచ్చి వుంటారు. ఒక్క శాంత తప్ప!

ఢిల్లీలో మనుమరాలిని చూసుకుంటూ మురిసిపోతుందేమో?... కూతురు కాల్చిపెట్టే రొట్టె ముక్కలు రుచి మరిగి, మరిచి పోయిందేమో?..... టూరిస్ట్ బస్సులో వెళ్లి హరిద్వార్, రుషీకేష్ చూసొస్తానంది. అక్కడ బావుండి, యిక్కడందర్నీ... ఛీ, ఛీ... బుద్ధి లేకపోతే సరి!

ఇక్కడో మనిషున్నాడు. తను లేనిదే కాల్చేతులాడవన్న సంగతే మర్చిపోయింది! రానీ చెప్తా... అన్నం తినకుండా అలిగితే అమ్మగారు టఫీమని దిగొస్తారు. తప్పయింది. యికముందు యింకెక్కడికీ వెళ్లనని చెంపలేసుకున్నదాకా మం చినీళ్లు కూడా ముట్టను. ముట్టనుగాక ముట్టను.

ఛీ.... ఛీ... ఉత్తరం రాశాక కూడా రాలేదంటే... ఆ మనిషినేమనుకోవాలి; ఇన్నేళ్లొచ్చి, ఇంగితమయినా లేకుండా.... ఛ... ఛ.... కూతురేగానీ, కొడుకేగానీ... ఎవరికెవరు? ఎవరి దగ్గరా వుండకూడదనుకునేగా ఇల్లు కట్టుకున్నది? అమ్మా, నాన్న కావాలనుకున్నోళ్లు - వాళ్లే వచ్చి చూస్తారు. మనం ఎవరి పంచనా వుండొద్దని ఎన్నిసార్లు అనుకోలేదు?

పోనీ... అవసరానికి ఐదారు రోజులయితే ఏదోలా సర్దుకోవచ్చు. ఇదేమిటి?... నెలల తరబడి ! అదీ పెద్దమనిషిని వదిలేసి... పిచ్చికాకపోతే.. నిజంగా పిచ్చిమాలోకమే!

నిద్రెలా పడుతుందో!... అసలు నిద్రపోతుందో లేదో... అసలే ఢిల్లీ ... చలిరోజులు.. జ్వరంతోగాని పడిందేమో...! ఉత్తరాది వంటలు వంటికి పడుతున్నాయో లేదో.... ఆ పులకలు ఎలా నముల్తుందో.... పిప్పన్నుకు మందివ్వమని పోతే, పన్నే పీకేశాడు డాక్టరు. తొర్రిది.... ఎలా నముల్తుందో?....

'మీరు తినందే, నాకు తిన్నట్టుండదండీ....' అనే మనిషి రెండు నెలల మూడు దినాలుగా ఎలా తింటుందో....

"గణ్, గ్‌ణ్.... గణ్... గ్‌ణ్...."

- ఉలిక్కిపడ్డాను. సిమెంటు బెంచీపై చాలా సేపట్నుంచీ కూచోవడం వల్ల కీళ్లు పట్టేశాయి. లేవలేక పోయాను.

ప్లాట్‌ఫాం నీరసంగా వుంది. పెద్ద సందడిగా లేదు. వున్న కొద్దిమందీ వొదిగి కూచున్నారక్కడక్కడా.

సన్యాసుల గుంపొకటి సరదాగా మాట్లాడుకుంటూ దాటి పోయారు. వాళ్లే నయం! ఇల్లూ వాకిలీ లేనివాళ్లయినా... తిన్నా, తినకున్నా... ఏ చెట్టుకిందనో హాయిగా ఆదమరచి....

"ఏ రైలుకు బాబూ గంట?"

"కన్యాకుమారి వస్తూంది"

"ఢిల్లీ నుంచేనా?"

"కాదు. గల్లీ నుంచి" ఫక్కున నవ్వాడతను. నడ్డికాళ్లోడు నడిగా. ఇంకొకర్నీ... ఇంకొకర్నీ ... ఇంకొ...

రైలొచ్చిందీ... వెళ్లింది! తుంటరి. కేకేస్తూ మరీ వెళ్లింది.

ఆ కేక - లేకిగా, వెక్కిరింతగా వుంది. రాకాసి అరుపులా అసహ్యంగా వుంది..

"ఏమ్మా.... కన్యాకుమారీ, ఎందరెందర్నో మోసుకొచ్చినదానివి. నా శాంతే బరువయిందా?

రైలు దిగిన వాళ్లు- మంచి వాళ్లు, మంచీ చెడులూ నిశితంగా చూస్తూ, 'ప్లాట్‌ఫాం' పొడవునా నిట్టూరుస్తూ .... "శాంతా... శాంతా..." గుండెల్లో ములుకై సుడి తిరుగుతున్న అయోమయం, ఆవేశం... బాధ... భయం..... కసి... దుఃఖం...

చూపు నుంచి జారిపోయిందేమోనని, గేటు దాకా వెళ్లి, దీపం పురుగు కోసం కాపేసిన బల్లిలా, గోడ కతుక్కొని, 'ఎక్స్‌రే' కళ్లతో ఎందర్ని చూసినా... ఉహు.... ఎవరిలోనూ శాంత పోలికలు లేవు.

"శాంతా!.. ఏమయింది శాంతా... ఉత్తరం అందేక బయల్దేరినా నాల్రోజుల ముందే నా ముందుండాల్సినదానివి. యింకా రాలేదేం శాంతా!

ఎప్పుడొస్తావు శాంతా..... అనుమానంగా వుంది. అసలొస్తావా.....

గేటు పట్టని జనం! కిక్కిరిసిన జనం! పుట్టల్లోంచి బయటపడిన నల్లచీమల్లా, లుకలుకలాడుతూ జనం!

మరో రైలెప్పుడో!.... ఆ రైల్లో శాంత రావాలి! వచ్చి తీరాలి.... వస్తూంది. అనుమానం లేదు. తప్పకుండా వస్తుంది. వస్తూం.... ది!!!

"నాల్రోజులుగా ఆ బెంచీని కిరాయికి తీసుకున్నాడ్రా ఆ ముసలోడు" దాపులోని కుళాయి దగ్గర నీళ్లు తాగి, మురికి చొక్కాతో మూతులు తుడుచుకుంటున్న కర్రికుంకలిద్దరిలో- మరీ కర్రిగున్నోడు వెకిలిగా నవ్వుతూ అన్నాడు.


"అవునురా... అవును. నాలుగు కాదు, నలభై రోజులయినా కిరాయికి తీసుకుంటాను. నా యిష్టం. అయినా నా బాధ మీకేం తెలుస్తదిరా తాడూ బొంగరం లేని గుంటవెధవల్లారా!" అనాలనిపించింది గానీ, నోరు పెగల్లేదు. నెమ్మదిగా అడుగులేస్తూ నా సిమెంటు బెంచీ కేసి కదిలాను.

ఆ క్రమాన్నే క్రమంలా మార్చుకున్న నలుగురు కుర్రాళ్లు నా సిమెంట్ బెంచీని వరించారు. నాల్రోజులుగా నన్నాదరించిన నా బెంచీపై ఆ గొట్టాం పంట్లాంగాళ్లని చూసేసరికి నా సొమ్మేదో దోచుకున్నట్టనిపించింది. "వెధవలోకం.. చిన్నాపెద్దా తేడా లేకుండా పోయింది. ఆ కూడోవడమేమిటి?.... వెన్నెముక లేదా?... ఆ మెలికలేంది?.... ఛీ.... ఛీ... ఆ నవ్వు... తుల్లిపాటుతో నవ్వేంత అవసరమేంది? 'కుర్రకుంకల్లారా... తుళ్లిపడకండిరా... దొర్లిపడే రోజులొచ్చినట్టున్నయిరా...' బయటకు కాదు, లోలోనే అనుకున్నాను.

"రేపు భారత్‌బంద్! రెళ్లుండవు" నలుగురిలో మరీ రివటలా వున్నతను నింపాదిగా అన్నాడు.

ఉలిక్కిపడి వారికేసి చూశాను.

'బందా?... రేపు రైళ్లు బందా?... అయితే ... అంటే ఢిల్లీ రైళ్లు రావా? అదెలా?.... దేశ రాజధానిలోనే అరాచకాన్ని అదుపు చేయకపోతే ఎలా?.... శాంతెలా?.. శాంత రాకపోతే ఎలా? ఛ.. ఛ.. బందులతో ఈ దేశం బాగుపడుద్దని వాగిన వాడెవడు? బందులతో జనం బాధల్ని పెంచి, లాభపడే వెధవాయి ఎవడు? దుకాణాలు, సినిమాలు, పోనీ.. బస్సులు బందయినా




## ఆస్కార్ బరువెంతో!?

ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రతిష్ఠాత్మకమయిన అవార్డు ఆస్కార్. సినీరంగ ప్రముఖులకు మాత్రమే ఇచ్చే ఈ ఆస్కార్ అవార్డు ప్రదానోత్సవాన్ని ప్రపంచమంతా ఆసక్తిగా తిలకిస్తుంది. ఆస్కార్ స్టాట్యూట్ అసలు పేరు అకాడెమీ అవార్డ్ ఆఫ్ మెరిట్. నల్లటి లోహపు దిమ్మె పైన బ్రిటానియంపై బంగారు పోత పోసిన ప్రతిమను ఆస్కార్‌గా అందజేస్తారు. ఈ ప్రతిమ ఎత్తు పదమూడున్నర అంగుళాలు, బరువు **3.85**కేజీలు. ఫిలిం రీల్‌పైన కత్తిపట్టి నిలబడి వున్న యోధుని ప్రతిమ ఇది. దర్శకులు, నిర్మాతలు, నటులు, సినీ రచయితలు, సాంకేతిక నిపుణులకు ఆస్కార్ అవార్డును అందిస్తారు. ఆస్కార్ అవార్డు రూపశిల్పి జార్జ్ స్టాన్లీ గిబ్బన్ డిజైన్‌ను బంకమట్టితో తయారు చేయగా, అలెక్స్ స్మిత్ **92.5** శాతం, తగరం, **7. 5** శాతం రాగి కలయికతో ఏర్పడిన బ్రిటానియంకు బంగారం పోత పోసి ఈ ప్రతిమకు రూపు దిద్దారు. అవార్డు గ్రహీతలుగాని, వారి వారసులు గానీ అవార్డు కమిటీ అనుమతి లేకుండా దీనిని వేరెవరికీ అమ్మరాదని నిబంధన వుండేది. ఒకవేళ దీనిని అమ్మదలిస్తే అకాడెమీకే అమ్మాలి. ఏ కారణాల వల్లనైనా అవార్డు గ్రహీత దీనిని తీసుకోవడానికి తిరస్కరిస్తే స్టాట్యూట్ మాత్రం కమిటీకే దక్కుతుంది. ఇదీ ఆస్కార్ కబుర్లు.

ఎలానో సర్దుకోవచ్చు. ఏకంగా రైళ్లే కదలకపోతే ... దూరాభారం ఎలా?'' లోలోనే అనుకుని నిజమేనా బా' అన్నా వారితో.

''ఏమిటి తాతా?''

''రైళ్లు బందన్నారుగా?''

''అవును, ఎక్కడికెళ్లాలి?''

''నేను కాదు, మా శాంత ఢిల్లీనుంచి వస్తుంది''

''ఐదు గంటలకు లింక్. తప్పితే లేవిక.

''అహ్ః లింక్ వస్తుందా? ..... ఐదుగంటలకే.. ఎంత చల్లని మాట చెప్పావు నాయనా? నా ఆయుస్సు కూడా కలుపుకుని, హాయిగా నూరేళ్లు బతుకు'' మాటలతో కాదు. మనసుతో దీవించాను.



కుర్రాళ్లు చూపులకదోలా అని పించారు కానీ, మంచితనం ఒంట బట్టిన మనుషుల్లా ఎదిగారు. నవ్వులతో లేచి వెళ్లిపోయారు.

''రెండుం బావయింది. ఇంకా రెండూ ముప్పావు గంటలకు లింక్ వస్తుంది. లింక్‌లో....!!!!???? .... వచ్చి తీరాలి! ఉత్తరం అందేక రాకుండా ఎలా వుంటది?'' మనసులో అనుకున్నాను.

''ఏమండీ, 'లింక్' లేటేమయినా వుందా?'' ఎదురొచ్చినతన్ని అడిగా.

''ఇప్పుడేం లింక్?... ఐదింటికి!'' అన్నాడతను.

ఇప్పడెలా?..... 'లింక్'కి చాలా టైముంది. ఇంటికెళితే మళ్లీ రానివ్వరు.

''చలిలో, చీకటిలో, తడబడుతూ పోకపోతేనేం?'' అంటూ గదమా యింపుగా చూస్తాడు సుపుత్రుడు.

''తాతగారూ.... నానమ్మకు ఇల్లు తెలీదా? ఆటోలో వస్తుందిగా!.... మీరెం దుకు వెళ్లడం?'' అంటుంది మనుమరాలు.

నిన్న ఉదయం....

సుపుత్రుడు ఊరి మీదపడి తిరిగేం దుకు వెళుతుంటే, ''జయా, కీళ్ల నొప్పులు... కళ్ల మంటలు... ఏవన్నా మాత్రలు...'' నా మాట పూర్తికాకుండానే ''ఇంటి పట్టున కూచో... అన్నీ సర్దుకుంటాయి'' అంటూ స్కూటరెక్కాడు.

వెధవ! అమ్మకోసం స్టేషన్‌కి వెళ్లడం కూడా తప్పయినట్టు ... అయినా అనుబంధాల గురించి ఈ తరానికేం తెలుసు? సంపాదనలూ, సరదాలూ తప్ప... చెప్పినా వినరు. అయినా ఎందుకు చెప్పడం? ఏం చెప్పనిచ్చారు?

''అమ్మను పంపొద్దురా... పెద్దమనిషి, తెలియని నగరం. భాషా తెలీదు. ఆ తిండీ తినలేదు..... వద్దురా బాబూ! వద్దేవద్దు...! అని గట్టిగా చెప్పాలనుకున్నాను. అరిచి మరీ చెప్పాలనుకున్నాను.

చెప్పనిస్తేనా? .. చెప్పక ముందే నిర్ణయించేశారు. నా శాంత సూట్‌కేసు సర్దేశారు.

'ఏం నాన్నా? అమ్మను చెల్లి దగ్గరకు పంపిద్దామా?' అని మాటవరసకైనా అడిగిన వాడు లేడు.

అక్కడ చెల్లికి పురుడొచ్చింది. అమ్మను పంపకపోతే ఎలా? బావేమనుకుంటాడు? – అని కొడుకులూ, అమ్మాయికి తొలి కాన్పు కదా, అల్లుడుగారు రమ్మని ఫోన్ చేశాడు. పోకపోతే మర్యాదగుండదు– అని శాంతా, అంతా ఏకమై, నిర్ణయం తీసుకున్నారే తప్ప, నా మనసు తెలుసుకున్నదీ లేదు, నన్నోమాట ... మాట వరుసకైనా అడిగిందీ లేదు. అసలు నేను గుర్తుంటేనా? రిటైరై ముష్టి పెన్షనుతో బతుకుతున్న వాణ్ణి! నా సంపాదన వాళ్ల పెట్రోలు ఖర్చుకు సరితూగదు. నేనెందుకు జమ!

వాళ్ల మొహమాటాల కోసం, మెహర్బానీలకోసం నా శాంతను రైలెక్కించారు. నా 'కళ్లజోడు'ను దూరం చేశారు. నా 'చేతికర్ర'ను ఢిల్లీ పంపించి , నన్ను కుంటివాణ్ణి చేశారు.

వికారంగా వుంది. కళ్లు మండు తున్నాయి. బి.పి. పెరిగినట్టుగా వుంది. నాలుగు దినాలుగా నిద్ర లేనందుకు! కాదు, కాదు... శాంత రానందుకు.... విసుగ్గా వుంది! ఒళ్లంతా నొప్పులు! నాలుగు రోజులుగా అంటే– తొంభయి ఆరు గంటలు ప్లాట్‌ఫాం వదలకుండా ఎదురు చూస్తున్నందుకు! కాదు కాదు... రమ్మని రాసినా శాంత రానందుకు!

ఏవి ఎప్పుడు అవసరమో... ఎక్కడ వుంటాయో నాకు తెలీదు. తెలుసుకోవాల్సిన అవసరం లేకుండా చేసింది శాంత!

''ఇదుగో, ఇక్కడ పెడుతున్నా, అవ సరముంటే తీసుకోండి మామయ్యా..'' కోడలు అంటుంది గానీ, ఆ తర్వాత, అవసరానికి ఏవీ గుర్తుకు రావు.

శాంత.... తను ఢిల్లీ వెళుతూ ఒంటరి తనాన్ని భరించేందుకు మతిమరుపును తోడుంచి మరీ వెళ్లింది.

నిన్న–

జేబులో దాచుకున్న చుట్టకోసం బల్లపై వెతుకుతుంటే మనుమరాలు నవ్వింది. ఆ పిల్దాని నవ్వుకు... శాంతను చెంపలు వాయించాలనిపించింది.

శాంత దాపునుంటే దేన్ని గురించీ ఆలోచనుండదు. కాని ఇప్పుడు ... అన్నీ ఆలోచనలే... చావు మరీ దాపులోనున్నట్ట నిపిస్తుంది.

ప్లాట్‌ఫాం మీద దీపాలు మలిగాయి.

చీకటి!

నాలోలానే.... బయటా, ప్రపంచ మంతా చీకటి!!

శాంత వుంటే చీకటి పెద్ద ఇబ్బందిగా వుండదు.

''మీరు కదలకండి''

''దీపం కావాలి శాంతా!''

''నేనున్నాగా.. దీపంతో ఏం పని?''

''నా చుట్ట...''

''చుట్ట తాక్కండి. డాక్టరు గారు మరీ మరీ చెప్పారు''

''డాక్టరేగా! నువ్వు కాదుగదా?''

''నేనా!... నేనెప్పుడు ఏం చెప్పాను! నన్నేం చెప్పనిచ్చారు మీరు? వినడమే తప్ప, చెప్పడం కూడా నాకు తెలుసునని మీకు తెలుసా?.... ఎందుకంటే యింకా బుకాయిస్తారు?

పాపం శాంత! ఏ విషయాన్నీ కాదని ఎరగదు. గంగిరెద్దులా తలూపుతూ... వంటావార్పులు, వడ్డనల తోనే బతుకంతా గడిపేసింది.

చల్లని గాలి తెర- ఈడ్చి మొహాన కొట్టింది. బెంచీపై మంచు తడి! కప్పుకున్న శాలువా చల్లగా వుంది. దవడల్లో వణుకు ఆరంభమయింది.

టీ తాగాలనిపించింది. కేంటీన్‌కేసి నడిచా.

పేపర్ కుర్రాడు!

పేపర్ కుర్రాడు!

పేపర్ కొన్నాను. వార్తలకోసం కాదు. మడిచి చంకనుంచుకొన్నాను.

గంట మోగింది.

''లింకేనా వచ్చేది?' పేపర్ కుర్రాణ్ణి అడిగాను.

''అవునండీ.... ''

మనసు రెపరెపలాడింది. గుండెల్లో దాగిన గుబులంతా తొలిగిపోతున్న అనుభూతి....!

జనం మరీ పల్చగా వున్నారు. శాంత తేలిగ్గానే కన్పిస్తుంది. హడావిడి చేస్తూ, ఆత్మీయంగా చేతులు కలుపుకుంటూ, సామానులు లెక్కించుకొంటూ... ఎంతయినా అదో ఆనందం!

'లింక్' రాజహంసలా వచ్చి, ఆగింది!

నా కాళ్లలో బలం రెట్టింపయింది. ''శాంతా... శాంతా...'' గట్టిగా పిలుస్తూ... కంగారూ, ఆరాటమూ, ఆనందమూ, భయం...!

అటూ ఇటూ తిరుగుతూ... అరుస్తూ, కేకలేస్తూ...

ఆ! రైలు......... ''శాంతా.... ఓ శాంతా....'

రైలు కూస్తూ ... కదిలింది!

శాంత... శాంతను దించకుండానే... శాంతా...

పోతున్న రైల్లో నిద్రపోతోందేమో!?! ఏమో...

నా పిచ్చిగానీ, చిన్నదీ చింపిరిదీ కాదుగదా?

రాస్కెల్! రాలేదు... ఇహ రాదు! రానే రాదు, రోగ్!

బిడ్డమందో మాకో పెట్టి తన కూతురుకోసం అట్టే పెట్టుకుంది. అవును, అదే... అలానే జరిగి వుంటుంది. కాకపోతే ఎందుకు రాదు? అసలు నా ఉత్తరాన్ని శాంతకు ఇవ్వకుండా దాచేశారేమో?... చింపేశా రేమో...

ఛ... ఛ... ఛీ... ఛీ...

వికారంగా వుంది. కళ్లు మండుతున్నాయి. బి.పి. పెరిగినట్టుగా వుంది. నాలుగు దినాలుగా నిద్ర లేనందుకు! కాదు, కాదు... శాంత రానందుకు....

విసుగ్గా వుంది! ఒళ్లంతా నొప్పులు! నాలుగు రోజులుగా అంటే– తొంభయి ఆరు గంటలు ప్లాట్‌ఫాం వదలకుండా ఎదురు చూస్తున్నందుకు! కాదు కాదు... రమ్మని రాసినా శాంత రానందుకు!

చావాలన్నంత చికాగ్గా వుంది. శాంతని తన్నాల న్నంత కోపంగా వుంది. దుఃఖం పొర్లుకొస్తూంది. గుండెలు ఏడుస్తున్నాయి. బెదిరించినా, బ్రతిమి లాడినా రాదిక! రానట్టే! తను బతికుండగా రాదు! రానట్టే లెక్కేసుకుని. ఛీ..:... ఛీ...

రానీ చెప్తా...

– నీరసంగా ప్లాట్‌ఫాం వదిలి, నిశ్శబ్దంగా రోదిస్తూ ఆటోలో ఇంటికి బయలుదేరాను.

వాకిలిలో ముగ్గులేస్తున్న కోడలు, నా బాధను గుర్తించి, పలుకరించే ధైర్యం చేయలేకపోయింది!

నా మంచంపై ఒంటరి మంచంపై ఒంటరిగా పడుకొన్నాను. ఎడబాటుతనంలోని భయంకర నిశ్శబ్ద రోదనలో మసు తడిసి పోతూంది. తల పగిలి పోయేలా నొప్పి. చెవి వెనుక నరాలు లాగుతూ...

''తాతగారూ, మీ ఉత్తరం'' నా మనుమరాలు వస్తూ అంది.

''ఆఁ! నా ఉత్తరమా? నానమ్మ రాసిందా? ఎప్పుడొచ్చింది? దిగ్గున లేస్తూ అన్నాను.

''ఊహూ! నానమ్మ రాసింది కాదు. మీరు నానమ్మకి రాసిన ఉత్తరం! పోస్ట్ చేయడం మర్చిపోయారు. మీ లాల్చీ, జేబులోనే వుంది'' అంటూ, ఉత్తరాన్ని నా చేతిలో పెట్టింది నా మనుమరాలు! ★



36